క్లుప్తంగా

విద్యార్థి కుటుంబానికి సాయం



చెక్కును అందజేస్తున్న ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో బీటెక్ ఫస్టియర్ చదువుతూ గత ఏడాది వంజివాక గ్రామానికి చెందిన హర్షిత్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కళాశాల విద్యార్థుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకంలో విద్యార్థి కుటుంబానికి నగదు అందజేశారు. యాక్సిస్ బ్యాంక్ గ్రూప్ యాక్సిడెంటల్ పాలసీ క్లెయిమ్‌లో భాగంగా ఆ విద్యార్థి తల్లి కాపులూరు పవిత్రకు రూ.4 లక్షల చెక్కును మంగళవారం కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిత



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న భరత్

రాపూరు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కరుణామయి విద్యాలయ సంస్థ నిర్వాహకుడు భరత్ పేర్కొన్నారు. రాపూరు మండలంలోని రాపూరు, గోనుపల్లి గ్రామాల్లోని కరుణామయి విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం యూనిఫాం, బూట్లు, బెల్టు, డైరీలు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుకోవాలన్న లక్ష్యంతో మాతృశ్రీ విజయేశ్వరిదేవి విద్యాలయాలు నెలకొల్పి, వారికి కావాల్సిన సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి వెంకట్రాయులు, ఉషా, ఉమ, హెచ్‌ఎంలు శంకరయ్య, మస్తానయ్య,విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గోనుపల్లిలో అవగాహన కల్పిస్తున్న రాజ్యలక్ష్మి

రాపూరు: గర్భిణీలు, బాలింతలు ,రక్తహీనతను అధిగమించేందుకు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. రాపూరు మండలం గోనుపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని తయారు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



క్రీడా పోటీల్లో ఉపాధ్యాయుల ఉత్సాహం

తడ: ఈ నెల 5వ తేదీన జరిగే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానంలో నిర్వహించినయీ పోటీల్లో వివిధ క్రీడాంశాల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి 5వ తేదీన నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందిచనున్నారు. కార్యక్రమంలో తడ బాల, బాలికల ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు సురేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు మంగళవారం క్రీడా పోటీలను నిర్వహించారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడా పోటీలు నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ సనత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు క్రీడలు మానసికంగా ఉపశమనం కలిగిస్తాయన్నారు. అనంతరం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి గురుపూజోత్సవం సందర్భంగా బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

నాయుడుపేట టౌన్: సూళ్లూరుపేట నియోజవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ వెల్లడించారు. నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో మంగళవారం ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్‌లతో సమావేశమయ్యారు. పాఠశాలలకు సంబంధించి ఏమైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పేటపై కుటుంబ పెత్తనం

- నెలవల కుటుంబీకులకే పనులు, పదవులు
- ఇద్దరు సోదరులకు చెరో మున్సిపాలిటీ
- రూ.కోటి విలువచేసే పనులు ఎమ్మెల్యే సోదరులిద్దరికీ ధారాదత్తం
- కొత్తగా టీడీపీలో చేరనున్న వ్యక్తికే చెంగాళమ్మ చైర్మన్‌గిరీ
- టీడీపీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టిన ఎమ్మెల్యే

సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే కుటుంబ పాలన సాగిస్తున్నారు. దీనిపై టీడీపీ నాయకులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదవులు, పనులు అన్నీ సొంత కుటుంబీకులకే కట్టబెట్టి, పార్టీ కోసం కష్టపడ్డ వారిని పక్కనపెడుతున్నారని ధ్వజమెత్తుతున్నారు. ఎన్నికల్లో ఖర్చు పెట్టిన మొత్తాన్ని తిరిగి సంపాదించుకునే క్రమంలోనే కుటుంబ పెత్తనం సాగిస్తున్నారని టీడీపీ నాయకులు భావిస్తున్నారు. ఈ విషయాలపై టీడీపీ శ్రేణులంతా ఏకమై ఎమ్మెల్యే తండ్రి తీరుపై అధినేత దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

– సాక్షి టాస్క్‌ఫోర్స్



రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు కొంతమంది కుటుంబ పాలన చేస్తున్నారని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో హెచ్చరించిన విషయం తెలిసిందే. సూళ్లూరుపేట నియోజకవర్గంలో మాత్రం ఆయన మాటలను బేఖాతర్ చేస్తూ ఎమ్మెల్యే విజయశ్రీ కుటుంబ సభ్యులు నేరుగా కుటుంబపాలన సాగిస్తున్నారు. ఎన్నికల పెట్టుబడి కోసం పొలాలు, కల్యాణ మండపాలు అమ్మేశాం.. వాటిని సంపాదించుకునేందుకు తలా ఒక చెయ్యి వెయ్యకపోతే ఎలా అనే ప్రశ్నలు ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల నుంచి దూసుకొస్తున్నాయి.

సూళ్లూరుపేటలో నెలవల విజయశ్రీ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే దొరవారిసత్రం మండలం మేలుపాక వద్ద నిల్వ చేసిన ఇసుక నిల్వలను ఆమె సోదరులు రాత్రికి రాత్రి తరలించేసిన విషయాన్ని ఆ పార్టీలో ఉన్న వారే బాహాటంగా ప్రచారం చేశారు. ప్రస్తుతం సూళ్లూరుపేట మున్సిపాలిటీలో డ్రైనేజీ కాలువల్లో పూడిక తీసే పనులకు రూ.30 లక్షలు మంజూరైతే ఆ పనులను ఎమ్మెల్యే చిన్న సోదరుడికి అప్పగించారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో కూడా డ్రైనేజీ కాలువలు పూడిక తీసేందుకు రూ.45 లక్షలు మంజూరైంది. ఆ పనులను ఎమ్మెల్యే పెద్ద సోదరుడు చేస్తున్నారు. అలాగే 2023 వరదల్లో జరిగిన నష్టానికి ఫ్లడ్ డేమేజ్ రిపేర్స్(ఎఫ్‌డీఆర్) గ్రాంట్ కూడా సుమారు కోటి రూపాయలు దాకా వచ్చింది. ఈ పనుల్లో కూడా కొంత వాళ్లే చేసి మరికొన్ని పనులు ఇతరులకు అప్పగించి వాటిలో పర్సంటేజీ కోసం పాకులాడుతున్నారు. వచ్చిన ఏ చిన్న అవకాశాన్ని వదులుకోవడం లేదు.

ఏదో రూపంలో అందులో ముడుపులు తీసుకునే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఎమ్మెల్యే కంటే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోటి రెట్లు మేలని తెలుగు తమ్ముళ్లు బాహాటంగానే చెబుతున్నారు. ఎమ్మెల్యే విజయశ్రీకి పాలనపై అవగాహన లేమి, ఏమీ తెలియకపోవడంతో టీడీపీలో వర్గపోరు ముదురుతోంది. ఏం అడిగినా నాన్నను అడగండి, అన్నను అడగండి అని మాట తప్ప స్వతహాగా ఏమీ చేయలేని పరిస్థితిలో ఆమె ఉన్నారని చర్చ నడుస్తోంది.

పార్టీలో లేని వారికే అగ్రతాంబూలం...

సూళ్లూరుపేటలో టీడీపీ నాయకులకు కాకుండా.. వేరే పార్టీలోని వారికే ఎమ్మెల్యే తండ్రి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తమ్ముళ్లు మండిపడుతున్నారు. తన ఇంటి వద్ద 20 మంది టీడీపీకి చెందిన నాయకులు కార్యకర్తలతో మాట్లాడే సమయంలో వేరే పార్టీకి చెందిన నాయకులు ఎవరైనా వస్తే చాలు ఇంటిలోపలకు తీసుకెళ్లి రహస్యంగా మాట్లాడి పనులు చక్కబెట్టి పంపుతున్నట్లు ఆరోపిస్తున్నారు. టీడీపీ కోసం మొదటి నుంచి పనిచేసిన వారిని ఇంటి బయటకే పరిమితం చేసి, వేరొక పార్టీకి చెందిన వారికి మాత్రం గౌరవంగా సాగనంపి టీడీపీ వారిని అవమానిస్తున్నారంటూ మండిపడుతున్నారు. నియోజకవర్గంలో ఇతర పార్టీల నాయకుల వద్ద డబ్బులు తీసుకుని టీడీపీలోకి తీసుకొచ్చి రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన శ్రీచెంగాళమ్మ ఆలయ చైర్మన్ పదవిని కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారని ప్రచారం సాగుతోంది. పార్టీకి మొదటి నుంచి పనిచేసిన వారు ఎంతోమంది ఉండగా ఇతర పార్టీ నుంచి వచ్చే వారికి చెంగాళమ్మ ఆలయ చైర్మన్ పదవి ఎందుకు కట్టబెట్టాలని తమ్ముళ్లు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని టీడీపీ నాయకులపై ఎమ్మెల్యే తండ్రి నెలవల సుబ్రహ్మణ్యం చిన్నచూపు చూస్తూ తీవ్ర అవమానాలకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ విషయాలన్నింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమైనట్లు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం సాగుతోంది.

కుటుంబ సభ్యులంతా ఎమ్మెల్యేలే...

ఎమ్మెల్యే కుటుంబంలోని అందరూ ఎమ్మెల్యేలుగా చలామణి అవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గెలిచిన అనతికాలంలోనే ఆమె మీద కాకుండా ఆమె కుటుంబసభ్యుల మీద పలు రకాలుగా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ వ్యాపారాలు చేసుకునే వారు, మట్టి, గ్రావెల్, ఇసుక తోలుకునే వారు ముందుగా కప్పం కడితే ఏమైనా చేసుకోమని చెబుతున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల విషయంలో కూడా బరువు పెట్టందే చేయడం లేదనే ఆరోపణలైతే ఎక్కువగా వినిపిస్తున్నాయి. బదిలీలు కావాలంటే ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ప్రసన్నం చేసుకుని ఎంతోకొంత సమర్పించుకుంటే పని జరుగుతుంది. లేదంటే ఆ ఫైల్ అక్కడే ఆగిపోతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా చిన్నపాటి పనికైనా సరే ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను కలవాల్సిందే. వారు ఆదేశాలు పాటించాల్సిందే. రాష్ట్రంలో కుటుంబ పాలన ఉన్న నియోజకవర్గాల్లో సూళ్లూరుపేట కూడా టాప్‌టెన్‌లో ఉందని టీడీపీ నాయకులే ఆరోపిస్తున్నారు.

గణేష్ ఉత్సవాలకు సత్వర అనుమతులు



మాట్లాడుతున్న డీఎస్పీ

సైదాపురం: ప్రభుత్వం సింగిల్ విండో విధానంతో గణేష్ ఉత్సవ అనుమతులను సులభతరం చేసిందని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు. మండల కేంద్రమైన సైదాపురం పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో విద్యుత్, పురపాలక, అగ్నిమాపక, పోలీసు శాఖల నుంచి ఎన్‌ఓసీ పత్రాలు తీసుకోవాల్సి ఉండేదని, ఇకపై అలా తిరగాల్సిన అవసరం లేదన్నారు. డివిజన్ పరిధిలో గణేష్ ఉత్సవాలు నిర్వహించదలిచిన వారు వాట్సాప్ నంబర్ 79950 95800 లేదా గణేష్ ఉత్సవ్ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసి, సచివాలయాల్లో చలానా రుసుం చెల్లించి అనుమతులు పొందవచ్చన్నారు. ఏ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ట ఏరోజు చేస్తారు, నిమజ్జనం ఏ రోజు, ఎక్కడ, ఏ సమయంలో చేస్తారు, ఏవాహనంలో తరలిస్తారు తదితర వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉత్సవాల నిర్వాహకులు వలంటీర్లను ఏర్పాటు చేసుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని డీఎస్పీ సూచించారు. మండపాల వద్ద ఎలాంటి పార్కింగ్ చేయరాదన్నారు. నిబంధనలకు అనుగుణంగా లౌడ్ స్పీకర్లను రాత్రి 10గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వినియోగించరాదన్నారు. ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో చవితి ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. ఆయన వెంట ఎస్‌ఐ క్రాంతికుమార్ ఉన్నారు.

గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కోట: ఈ నెల 7వ తేదీన వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాల్లో వినాయకుని విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కోట ఎస్‌ఐ పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం కోట పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ ఉత్సవ కమిటీలు ముందుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, ఉత్సవ కమిటీ సభ్యుల వివరాలు, ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహించేది తదితర కార్యక్రమాల వివరాలు తెలియజేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలు ఉంటే పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎవరికీ ఇబ్బందులు లేకుండా పూజలు చేసుకోవాలన్నారు. అధిక శబ్దంతో మైకులు ఏర్పాటు చేయడం నిషిద్ధమన్నారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా ఉత్సవ కమిటీలదే బాధ్యతన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ పవన్‌కుమార్

సీపీఐ బలోపేతానికి చర్యలు

కోట: సీపీఐ కార్యవర్గ సమావేశం మంగళవారం విద్యానగర్‌లో నిర్వహించారు. సీపీఐ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో బలపడాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, నారాయణ, భాస్కర్, నజీర్ పాల్గొన్నారు.

కండలేరులో 7.890 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 7.890 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 4800 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. అలాగే సత్యసాయిగంగ కాలువకు 260, పిన్నేరువాగుకు 25, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 120 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

కోట: మండలంలో విద్యారంగానికి సేవలందించిన ఏడుగురిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు ఎంఈఓ మస్తానయ్య మంగళవారం తెలిపారు. పి.నాగరాజు, ఎ.శ్యామల, పి.ప్రతాప్, ఎల్.మంజుల, ఇ.శ్రీనివాసులు, ఎస్‌కే షెహతాజ్, ఎం.వెంకట్రావులను ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు.

చుక్కల్లోకి నిత్యావసరాల ధరలు

సూళ్లూరుపేట: దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర వస్తువులు ధరల పెరుగుదలకు అడ్డూఅదుపు లేకుండా పెరిగిపోయాయని తిరుపతి జిల్లా సీపీఐ కార్యదర్శి మురళీ పేర్కొన్నారు. విపరీతంగా పెరిగిపోయిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సీపీఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద సూళ్లూరుపేట, సత్యవేడు నియోజకవర్గాలకు చెందివారు ధర్నా నిర్వహించి, వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రవాణా చార్జీలు పెరిగి, ఆ భారం నిత్యావసర వస్తువులపై పడిందన్నారు. దీంతో పప్పు దినుసులతో పాటు ఇతర వస్తువులు, వంటనూనెలు, బియ్యం కాయగూరలతో పాటు అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అన్ని తరగతుల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రధానమంత్రేమో భారతదేశం వెలిగిపోతోందని అని చెప్పుకుంటున్నారని ఆరోపించారు. వ్యవసాయ రంగంపై సవతితల్లి ప్రేమ చూపిస్తూ రైతులు పండించే రకరకాల పంటలకు కనీస మద్దతు ధరల్లేకుండా చేస్తున్నారని తెలిపారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పదేళ్ల పరిపాలనలో 1.30 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత సంఘం అధ్యక్షుడు మోదుగుల పార్థసారథి, సత్యవేడు నియోజకవర్గ నాయకులు చిన్నిరాజ్, సూళ్లూరుపేట నాయకులు చెంగేణి సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ధరలు తగ్గించాలని సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా

కడుపు నొప్పితో గర్భిణీ మృతి

వాకాడు: తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ గర్భవతి మృతి చెందిన సంఘటన మంగళవారం వాకాడు మండలం నెల్లిపూడి దళితవాడలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు ఇంగిలాల శామ్యూల్ భార్య దీపిక (22) ఆరు నెలల గర్భవతి. సోమవారం రాత్రి ఆమెకు తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో కోటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లిది. అక్కడ పరీక్షలు చేసుకుని మందులు తీసుకుని, ఇంటికి తిరిగి వచ్చేసింది. వేకువజామున మళ్లీ కడుపు నొప్పితోపాటు గుండెపోటు రావడంతో దీపిక మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు. సమాచారం తెలుసుకున్న వాకాడు తహసీల్దార్ రామయ్య పోస్టుమార్టం నిర్వహించే బాలిరెడ్డిపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించారు.



దీపిక మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామయ్య

ఘనంగా నాగార్పమ్మ ఉత్సవాలు

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని పెరికిలంపాటి కండ్రిగ గ్రామంలో గ్రామ దేవత నాగార్పమ్మ ఉత్సవాలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అమ్మవారి శిలప్రతిమ వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో సుబ్రహ్మణ్యం భగవతి దంపతుల సారథ్యంలో నాగార్పమ్మకు బోనాలు సమర్పించారు. రాత్రి నుంచి గ్రామంలో అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిపారు. తెలంగాణకు చెందిన పల్లె ప్రవీణ్ సాంస్కృతిక కార్యక్రమాలు, వెంటయ్య బృందం కోలాటం ఆకట్టుకున్నాయి.



నాగార్పమ్మ ఉత్సవాల్లో భక్తులు

ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి

చంద్రగిరి: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాలు..దొరవారిసత్రం మండలం మెల్లనత్తూరుకు చెందిన మణికంఠ(24) గత నెల 24న మండలంలోని ఎం.కొంగరవారిపల్లె బీసీ కాలనీకి తన భార్య నందినితో కలసి అత్తగారింటికి వచ్చాడు. అక్కడ దంపతులు గొడవ పడ్డారు. క్షణికావేశంతో మణికంఠ పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన తిరుపతి రుయా, అక్కడ నుంచి స్విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మణికంఠ మృతి చెందాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూడోలో విద్యార్థులు రాణించాలి

నాయుడుపేట టౌన్: జూడో క్రీడలో ఉత్తమ శిక్షణ పొందుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని జూడో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఆదవరం నాగూరయ్య విద్యార్థులకు సూచించారు. నాయుడుపేట పట్టణంలోని ప్రభుత్వ బాలుర గురుకులంలో జూడో క్రీడాకారుల కోసం ట్రినిటీ హాస్పిటల్‌వారి సహకరంతో రూ.4 లక్షలు విలువ చేసే మ్యాట్స్‌ను అందించారు. ఈ సందర్భంగా నాగూరయ్య మాట్లాడుతూ ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా రాష్ట్రంలో మూడు జూడో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జూడోలో ప్రతిభ చూపిన నాయుడుపేట గురుకులానికి 9 మంది విద్యార్థులకు ఒక్కొక్కరి వెయ్యి రూపాయలు చొప్పున నగదు బహుమతులను నాగూరయ్య అందించారు. గురుకులానికి స్వచ్ఛమైన తాగునీరు అందించేలా స్వర్ణముఖి నది నుంచి పైపులైన్ వేసేందుకు అయ్యే ఖర్చును భరిస్తామని నాగూరయ్య తెలిపారు. అసోసియేషన్‌కు చెందిన బట్టా సుబ్రహ్మణ్యం యాదవ్, రోషన్ బాలచంద్రా, రమేష్ నాయుడు, పి.మల్లికార్జున రెడ్డి, గురుకులం ప్రిన్సిపల్ దాదాపీర్, కోచ్ ఉదయ్, పీఈటీ భాస్కర్, పీడీ కాటయ్య, ఉపాధ్యాయుడు బందిలి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు బహుమతుల పంపిణీ

బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించాలి

కలువాయి: బాధ్యతతో ప్రతి పౌరుడు పర్యావరణాన్ని పరిరక్షించాలని కలువాయి మండలం చీపినాపి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విరివిగా మొక్కలు నాటి, వాటిని పెంచడంతో వాతారణం కాలుష్యం కాకుండా స్వచ్ఛమైన గాలి ప్రజలకు అందుతుందన్నారు. అనంతరం పాఠశాల వాచ్‌మెన్ చిన్నయ్యను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

రాపూరులో భారీ వర్షం



రాపూరులో కురుస్తున్న వర్షం

రాపూరు: మండల పరిధిలో మంగళవారం సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఎండవేడిమికి బాధపడుతున్న ప్రజలకు చల్లని వర్షం రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి లోతట్టు ప్రాంతమంతా వర్షపు నీటితో నిండి పోయింది. వర్షం కురవడంపై నిమ్మరైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డీవీ సత్రంలో 32.8మి.మీ వర్షపాతం

దొరవారిసత్రం: మండల పరిధిలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. డీవీ సత్రంలో 32.8మి.మీ వర్షపాతం నమోదైయినట్లు స్థానిక తహసీల్దార్ శైలకుమారి తెలిపారు. మంగళవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉన్నది.

స్వర్ణముఖి పొర్లు కట్టల పరిశీలన

కోట: పుచ్చలపల్లి వద్ద స్వర్ణముఖి నది పొర్లు కట్టలను మంగళవారం తహసీల్దార్ జయజయరావు ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించారు. మండలంలో వరద తాకిడికి గురయ్యే ప్రాంతం పుచ్చలపల్లి. ఇక్కడ స్వర్ణముఖి పొర్లు కట్టలు బలహీనంగా ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులు సందర్శించారు. స్వర్ణముఖి నదికి వరద వస్తే పుచ్చలపల్లి ముంపునకు గురవుతుందని గ్రామస్తులు అధికారుల దృష్టికి తెచ్చారు. పొర్లు కట్టలు కోతకు గురై బలహీనంగా ఉన్న చోట వెంటనే మరమ్మతులు చేపడుతామని తహసీల్దార్ తెలిపారు.



పొర్లు కట్టలను పరిశీలిస్తున్న అధికారులు

కోల్‌కతా అమానుషంపై నిరసన



తొగరాముడి పీహెచ్‌సీ వద్ద నిరసన కార్యక్రమం

దొరవారిసత్రం: గత నెలలో కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యను వ్యతిరేకిస్తూ స్థానిక ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అమానుషానికి కారకులైన ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలని తొగరాముడి గ్రామ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డిమాండ్ చేశారు. అనంతరం ఆశ వర్కర్లకు సమావేశం నిర్వహించారు. అదే విధంగా డీవీ సత్రం పీహెచ్‌సీలో కూడా ఆశవర్కర్లకు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల వద్ద ఏబీవీపీ ఆందోళన


నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద ఏబీవీపీకి చెందిన విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. సోమవారం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. అయితే పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తరగతులు నిర్వహిస్తుండడంతో ఏబీవీపీ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. అయితే పాఠశాల యాజమాన్యం ఏబీవీపీ విద్యార్థులపై దురుసుగా ప్రవర్తించారని మంగళవారం పాఠశాల వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

వరవ కాలువ లీకేజీతో నీటి వృథా

కలువాయి: సోమశిల డ్యాం నుండి కండలేరు డ్యాంకు వరవ కాలువ ద్వారా వెళ్తున్న నీరు వృథా పోతోంది. వరవ కాలువ ద్వారా అధికారులు 6వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు.వరవ కాలువ 4వ కిలోమీటరు వద్ద భారీగా లీకేజీ అవుతోంది. దీంతో లీకేజీ అవుతున్న నీరు మొత్తం భారీగా కుల్లూరు చెరువుకు చేరగా చెరువు నిండిపోయి కలుజు పారుతోంది. అంతేగాక వెంకటరెడ్డిపల్లి, కల్లూరు చెందిన 400 ఎకరాలు నీటి ప్రవాహంలో మునిగిపోయింది. దీంతో నష్టాలు పాలవుతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు. సోమశిల– కలువాయి ప్రధాన మార్గంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామం సమీపంలో రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. దీంతో అటువైపుగా వెళ్తున్న వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని తగు నివారణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



కలుజు పారుతున్న కుల్లూరు చెరువు